# స్మృతి రేఖలు

భాస్కరభట్ల కృష్ణారావు

జీవితంలో కొన్ని సంఘటనలు మన హృదయాన్ని కదిలిస్తాయి. ఆకదలికలు ఒక స్థాయి దాటితే, మన మెదడులో జ్ఞాపకాలుగా మారుతాయి. కాలం, కొన్ని జ్ఞాపకాల్ని చెరిపివేస్తుంది. కొన్నిటిని శాశ్వతంగా మెదడులో నిలుపుతుంది. కాని ఏసంఘటనలు జ్ఞాపకాలుగా మారుతాయో, ఏవి కాలం వడపోతకి తట్టుకొని, మెదడులో శాశ్వతంగా నిలిచిపోతాయో చెప్పడం మాత్రం చాలాకష్టం.

ప్రస్తుతం నేను మీకు చెప్పదలచిన సంఘటన దాదాపు ఇరవై సంవత్సరాలక్రితం జరిగింది. ఆ సంఘటనలో ఏదోవిశిష్టత వుందనికాదు నేను మీకు చెప్పడం. ఇటువంటి సంఘటనలు ఎందరి జీవితాల్లోనో జరగడానికి అవకాశం వుంది. కాని ఆయా సంఘటనలు వాళ్ళకి జ్ఞాపకం ఉన్నాయో లేవోమాత్రం నాకు తెలియదు. ఈ సంఘటన మాత్రం, తు, చ, తప్పకుండా, అన్నివివరాలతో నాకు పూర్తిగా జ్ఞాపకం వుంది. అదే దాని విశిష్టతా, ప్రత్యేకతాను. ఈ సంఘటన, చెరగని జ్ఞాపకంగా నామెదడులో నిలిచిపోవడానికిగల కారణాలేమిటో, మీతోకలిసి పైకి ఆలోచించడం, ఈ కథనంలో నా ముఖ్యోద్దేశం.

ఇది ఇరవై సంవత్సరాల క్రిందటి మాట— అప్పటికి నాకు ఇరువైరెండు సంవత్సరాలు— వివాహమై అప్పటికి మూడు సంవత్సరాలైంది. ఏడాదివయస్సు దాటిన కూతురు. పేరు కళ్యాణి. అప్పట్లో చదువుకూడా పూర్తి అయింది. సెక్రెటేరియట్‌లో ఉద్యోగం చేస్తున్నాను.

యవ్వనపు పొంగు అప్పటికి ఇంకా సడలలేదు. గార్హస్థ్య జీవితానికి అప్పటికప్పుడే అలవాటు పడుతున్నాను. ఉద్యోగధర్మంవల్ల నగరంలో విడిగా భార్య, కూతురుతో కాపురం చేస్తున్నాను.

ఇంతలోనే ఒకనాడు మాకు ఒక పెళ్ళిపిలుపు వచ్చింది.

నా మరదలి పెళ్ళి — మా మామగారు స్వయంగా వచ్చి పిలిచారు. తండ్రిని చూడడంతోనే, నా భార్య పెళ్ళికి వెళ్ళడానికి ఉబలాటపడింది. పెళ్ళికి ఇంకా పదిరోజులు ఉన్నాయి. వెంటనే కూతురిని పంపించవలసిందని మా మామగారు కోరారు. అంతతొందరగా పంపించడం నాకు ఇష్టంలేదు. పెళ్ళికి తీసుకు వస్తానని చెప్పాను. నా భార్య ఉబలాటం, మా మామగారి తొందరపాటూ, ఈ రెండు కారణాలవల్ల, నామాట సాగలేదు. విష్కారం దేనికని, నా భార్యని మా మామగారితో, పదిరోజులు ముందుగానే పెళ్ళికి పంపించివేశాను.

ఒంటరి జీవితం నాకు ఎన్నడూ అలవాటులేదు. ప్రసవానికి వెళ్ళిన నాలుగు మాసాలుతప్ప, నేను ఎన్నడూ నా భార్యని వదిలి వుండలేదు. కాలేజీలో చదువుతున్న రోజుల్లోకూడా హాస్టల్‌లో ఎప్పుడూ ఒంటరిగా వుండలేదు. ఎవడో ఒకడు రూమ్‌మేట్ వుంటూ వుండేవాడు. అందువల్ల నా భార్య పుట్టింటికి వెళ్ళిన పదిరోజులూ, నాకు నగరంలో, ఎంతో దుర్భరంగా గడిచాయి. పోనీ ముందుగానే శలవు తీసుకొని పెళ్ళికి వెడదామంటే ఓకంకొద్దీ శలవు దొరకదని మా మామగారితో బొంకాను. తీరా శలవు తీసుకొనివెడితే వారేమనుకుంటారో అని నా భయం. వారి కళ్ళల్లో చులకన కావడం నాకు ఏమాత్రం ఇష్టంలేదు. అల్లుడు ప్రయోజకుడనే భావం వారికి కలిగించడానికి, అప్పట్లో శలవుదొరకదని ఖచ్చితంగా చెప్పాను. యథోచితంగా, నా భార్యముందూ, మా మామగారి ముందూ బింకం నటించాను. రెండింటికీ చెడ్డ రేవడికథ అయింది నాది. అటు పెళ్ళికి వెళ్ళలేను, ఇటు ఒంటరిగా వుండలేను. సత్రం భోజనం, మఠం నిద్ర అన్నట్లు, హోటల్‌లో భోజనంచేస్తూ, సాయంత్రాలు సినిమాహాలులో గడుపుతూ, కాలం వెళ్ళబుచ్చుతూ వచ్చాను.

ఏ పిక్చర్ చూసినా ఏముంటుంది ? ఏదో ప్రణయగాథ — ఏవో ఎడబాట్లు, వేడి నిట్టూర్పులు — కన్నీటి ధారలు, విరహవేదనలు — నిజం చెప్పొద్దూ, ఇవి అన్నీ నాకు పరమ శత్రువులైనాయి. ఏమీ తోచదు. ఆఫీసులో పనిచేయడానికి మనస్సు ఒప్పదు. రాత్రిళ్ళు నిద్రపట్టదు. ఏవో ఆలోచనలు — ఏవో పిచ్చి పిచ్చి కలలు — రాత్రిళ్ళు లేచి, నక్షత్రాలు లెఖ్ఖపెట్టలేదుగాని, నిద్రపట్టక ఒకటేపనిగా పక్కమీదపడి దొర్లాను.

క్షణం ఒక యుగంగా తొమ్మిది రోజులు గడిచాయి. ఆతొమ్మిది రోజులూ నేను అనుభవించిన విరహవేదన, ఏ ప్రబంధంలో, ఏ నాయకుడూ అనుభవించలేదని నా నమ్మకం. —

పదవరోజు రాత్రి పదిగంటలకు పెళ్ళి —

తొమ్మిదవరోజునే ఆఫీసుకు రెండురోజులు శలవు పెట్టాను. పెళ్ళినాడు ఉదయమే ప్రయాణమై, ఆమరునటిరోజునే నగరానికి తిరిగి రావాలని నా సంకల్పం. —

పెళ్ళినాడు ఉదయమేలేచి, స్నానంచేసి, బట్టలు మార్చుకున్నాను. ఉలన్‌ప్యాంటు, సిల్కుషర్టుతో హోటల్‌కి బయల్దేరాను. కాఫీదేవాలయానికి వెళ్ళి, కాఫీ, ఉప్మా సేవించాను. ఇంటికి తిరిగి వచ్చేసరికి ఏడున్నర అయింది. ఎనిమిదిగంటలకు నల్లగొండకి బస్సు. సూట్‌కేసులో రెండు ప్యాంట్లూ, రెండు షర్టులూ, రెండు ధోవతులూ, బనియన్‌లు, టవల్‌లు, ఇంకా కావల్సిన వస్తుసామగ్రి అంతా అమర్చుకొని, బస్సుస్టాండుకి వెళ్ళాను. బస్సు బయల్దేరడానికి ఇంకా అయిదు నిమిషాలు మాత్రం మిగిలి ఉన్నాయి. ప్రయాణానికై కావల్సిన సిగరెట్లు కొనుక్కొని బస్సు ఎక్కాను.

బస్సు కదిలింది— ప్రాణం కుదుటబడింది— నల్లగొండకి చేరుకునేసరికే రెండుగంటలు దాటింది.

దారిలో ఏపల్లెటూరి దృశ్యాలు చూచానో, ఏవి చూడలేదో ఇప్పుడు చెప్పడం అసాధ్యం— బస్సు ప్రయాణం అనుభవించాల్సిందేకాని

తెచ్చినదలవికాదు — దానితో శరీరం బస్సు కుదుపు లకి పొంగిపోతోంది. శరీరమంతా మట్టి కొట్టు కుంది.

కళ్ళు, ముక్కు, నోరు, చెవులు దుమ్ము తోనిండి అయిపోయాయి. దుమ్ము తుడిచి తుడిచి జేబురుమాలు ఎర్రమట్టితో నిండింది.

పల్లెగొండకి నా మనస్సు ముందుగా వెళ్ళిందో, లేక నా అవస్థ ముందుగా వెళ్ళిందో, ఏనాటి సంగతో, ఇప్పుడు గట్టిగా తేల్చి చెప్పడం కష్టం— బస్సులో నార్కెటుపల్లి దగ్గర ఒక పెళ్ళివారి జంట ఎక్కింది. వాళ్ళ క్రీగంటి చూపులు, నవ్వుల గలగలలు, ప్రేమకి సంబంధించిన సయ్యాటలు నా మనస్సుని కలచివేశాయి. సభ్యతమోహం ఎరుగని సయ్యాటలవి. ఎంతో హాయిగా, స్వేచ్ఛగా కనపడ్డాయి. ఏ ప్రతిబంధకాలూ ఎరగని ప్రణయం మది. ఎందుకో అంది నా సభ్యతని సిగ్గు లజేసింది.

పెళ్ళిల్లు మామిడితోరణాలతో, అరటి స్తంభాలతో, ఇంకా యితరమైన ఏవో అలంకారా లతో కళకళలాడుతున్నది. ఆకలితో వుండడం వల్ల ఆ అలంకారాలు ఏమీ నేను చూడలేకపో యాను. వెళ్ళడంతోనే, నన్ను ఎందరో పలక రించారు. కాని నాకు కావల్సిన మనుష్యులెవ్వరూ కనపడలేదు. మామగారు ఎక్కడికి వెళ్ళారో తెలియదు. దిక్కులు చూస్తూ, పెళ్ళి పందిరి పక్కన పడేస్తున్న ఒక్క కుర్చీలో కూర్చున్నాను.

రెండు నిముషాల తరువాత ''బాగున్నావా, బావా ?'' అని ఒక అమ్మాయి వచ్చి నన్ను పలక రించింది.

ఆ అమ్మాయి ఎవ్వరో నేను వెంటనే గుర్తు పట్టలేదు. మా కళ్యాణి, ఆ అమ్మాయి చంకలో వుంది. నన్ను చూడడంతోనే, కేరింతలుకొడుతూ నాకు చేతులు అందించింది. నేను కళ్యాణిని ఎత్తు కున్నాను. ముంగురులు నొసటిమీదినించి వెనక్కి నెట్టుతూ, ఆప్యాయంగా మా పాపని ముద్దు పెట్టుకున్నాను.

''ఇంకా నన్ను గుర్తుపట్టలేదా, బావా ?'' అని అడిగింది ఆ అమ్మాయి, నాకళ్ళల్లోకి చూస్తూ—

ఎవరో ఆ అమ్మాయి — నేను గుర్తుపట్ట లేకపోయాను.

''నేను ఇందిరని బావా!'' అంది ఆ అమ్మాయి, నా చిత్రమైనచూపుల్లోని అంతరార్థాన్ని గ్రహిస్తూ.

''ఏ, ఇందిర ? నాపెళ్ళికి ముందు నాకు ముస్తాబు చేసిన్న ఇందిర కాదుకదా ?'' అని మనస్సు ఒక నిముషంపాటు తటపటాయించింది.

సందేహంలేదు — నేను న్నాలుగు సంవత్సరాల క్రితం పెళ్ళిచూపులకై భువనగిరికి వెళ్ళిచూసిన ఇందిరే —

బొట్టు కనపడదేం? చెరిగిపోయిందా ? లేక విధవ అయిందా ? ఏమో ?

ఆమాటలు ఆ అమ్మాయిని పరికించి చూసాను. సందేహంలేదు. మాంగల్యాన్ని తోస్తోంది— ఇందిరే —



రంగవల్లి

పుట్టెడు ప్రశ్నల్ని మనస్సులో అణచుకొని, ''ఇందిరా'' అని మాత్రం అనగలిగాను.

''ఇక్కడ కూర్చున్నావేమిటి బావా ?'' అని అడిగింది ఇందిర—

''ఏమి చెయ్యను ? ఎవ్వరూ కనపడలేదు'' అని అన్నాను ఏమీ తోచక—

''అందరూ భోజనాలు చేస్తున్నారు — పాప అల్లరి చేస్తుంటే, భోజనాలదగ్గరినించి దీనిని ఎత్తుకొని వచ్చాను'' అంది ఇందిర. —

''మీ అక్కయ్య ఏదీ ?'' అని అడిగాను, ఇందిరని—

''ఇప్పుడే పిలుచుకువస్తా'' అని చటుక్కున లోపలికి వెళ్ళింది ఇందిర—

భోజనం చేస్తున్నదల్లా, నాభార్య చేతులు కడుక్కొని పందిట్లోకి వచ్చింది — ఇందిరకూడా నా భార్యతో కలిసి వెలుపలికి వచ్చేసింది.

ఆ పక్కయింట్లోనే మాకు విడిది యిచ్చారు. ముందు రఘూ, మా పాపతో కలిసి ఆ పక్కయింటికి వెళ్ళాను.

పెళ్ళి వెళ్ళడంతోనే నాకు ఆకలేస్తున్నదని అన్నాను నా భార్యతో. —

''మీరు బట్టలు విడవండి — నేను ఇంతలోకే కాఫీ కాస్తాను'' అని నా భార్య అగదిలోంచి వెళ్ళి డికో వెళ్ళింది. నాదగ్గరవున్న పాప, రెండుచేతులు చాచి ఇందిరమీదకు ఉరికింది. ఆమె మంద హాసంతో అందుకొంది.

సిల్కుషర్టు విడిచి, ధోతి కట్టుకోవడానికి సంసిద్ధపడుతున్నాను.

ఇంతలోకే నాభార్యవచ్చి, ''ఇందిరా నీవు వెళ్ళి బావకి కాస్త స్నానానికి నీళ్ళుతోడు'' అని చెప్పింది దర్జాగా —

పాపని, నాభార్యచేతి కందించి, ఇందిర నీళ్ళు తోడడానికి అక్కడినించి కిందికి వెళ్ళిపోయింది.

''దీన్ని మీరు తీసుకోండి — ఇప్పుడే మీకు కాఫీ తెచ్చిపెడతా''నంది నా భార్య. —

అది ఏడుస్తూ, ఇందిర వెళ్ళినవైపే చూస్తోంది పాపను నేనెత్తుకొని దానితో ఏవో కబుర్లు చెబు తున్నాను.

ఇంతలోకే కాఫీ వచ్చింది — నేనూ, పాపా కలిసి కాఫీ తాగాము.

''రావా, నీళ్ళు పోస్తాను, కిందికి రండి'' అని ఇందిర కేకవేసి అరిచింది.

నేను పాపని ఎత్తుకొని కిందికి వెళ్ళాను—

స్నానాలగదిలో ధోవతి, టవల్, బనియన్, సబ్బు అన్నీ అమర్చివున్నాయి. వేడినీళ్ళు చూస్తే పాపకి ప్రాణాలు లేచివచ్చాయి.

మాగదాపలో అదీ స్నానం చేస్తానని పేంకుపెట్టు పట్టింది.

''ఇలా యిస్తావా పాపని స్నానం చేయిస్తాను'' అన్నాను. ఆమె అందివ్వబోయింది. కాని పాప ఆమెని మెడ గట్టిగా పట్టుకొని రానన్నట్టు తల వూపింది.

సరే ఇందిరే పాపని పీటమీద కూర్చోబెట్టి నీళ్ళు పోస్తోంది. నేనా దృశ్యం చూస్తూ అలాగే నిలబడి వున్నాను. ఎక్కడో, ఎప్పుడో, నేను వేసుకోదలచిన బాంధవ్య ముద్ర, పట్టుతప్పి, కొంతకాలం దూరంగా ప్రయాణించి తిరిగివచ్చి యీ అంటు మొక్కకు అట్టుకు పోతోందేమిటో అన్న భావం కలిగింది నాలో....

ఇందిర నానాడు పెళ్ళాడితే నిత్యం యిలాంటి దృశ్యమే చూసేవాణ్ణి. కాని యీ పాప ఆ పాపగా వుండేదికాదు. ఆ పాప వేరు. ఆపాపపైన ఇందిర కుండే ప్రేమ, అనురాగం, సహజమైనవిగా వుండేవి. యీ పాపపై ప్రేమ ఏదో దైవదత్తంగా తోస్తోంది. ఆధ్యాత్మికప్పటంచుల్లో తొంగి చూస్తోంది. పరిణయం గార్హస్థ్య జీవితానికి నాంది. సంతానం — ప్రథమ సంతానమే ఆ ప్రణయ జీవితానికి పరిసమాప్తి. ఇందిర పాపల ప్రేమలో నాలో అద్యంతాలను కలిపి వేస్తున్నట్టుగా తోచింది.

ఇందిర మెల్లగా పాప ముఖం రుద్దుతూ ''కళ్ళు తెరవకు తల్లీ... కొంచెం నేను అలాగే వుండు..... చందమామ వెళ్తుతూరు కనిపిస్తుంది. అంటూ ఏదో చెపుతోంది. అప్పుడు నావంక చూచి నవ్వు జాచింది. కాసిని నీళ్ళు పోస్తారా అన్నట్టుగా. కాని వెంటనే 'నీళ్ళు' అనే భావం కలుగలేదు. ఏవో ఆలోచనలు అంచుల్లో అడుగులు వేస్తూ నడుస్తూన్న నామనస్సు కాపాస్తం — ఏదో యాచిస్తున్నట్టు స్ఫురించింది. నా మౌనం గ్రహించి ''కాసిని నీళ్ళు పొయ్యండి'' అందామె. అప్పుడు తేరుకొని చెంబలో నీళ్ళు పోశాను. పాపకు ముఖం కడిగింది. సబ్బులో రుద్దడం వల్లనంటే, అగ్రేమ హస్తాలతో నిమరడం వల్ల కాబోలు పాపాపా చెక్కిళ్ళు ఇంగిలీకపు కాంతులు గుమ్మరిస్తున్నాయి. కళ్ళు కలువ పువ్వు చివుళ్ళుగా మెరుస్తున్నాయి.

''పాపం, పాపకోసం చాలా శ్రమ పడుతున్నారు'' అన్నాను. అనాలోచితంగా.

ఆమె వంచిన తల యెత్తకుండానే ''నేను కొత్తగా శోధించుకోడం శ్రమ కాదూ'' అంది.

ఆ మాటకు నామనస్సు చిందర వందరైంది. ఆమె ఎంతనొచ్చుకుందోననుకున్నాను.

''మరి నీ వుద్దేశ్యం?'' అన్నాను.

ఆమె పైట కొంగుతో కళ్ళు తుడుచుకుంటోంది.

''అది కాదు ఇందిరా, పాపపైన నీకంత ప్రేమ ఎందుకు కలిగిందా? అని ఆలోచిస్తూ, ఆనందిస్తూ అలా ప్రశ్నించాను. అంతే'' అన్నాను.

''అదే నేను తేల్చుకోలేకుండా వున్నాను. పదేపదే ఆత్మను ప్రశ్నించుకున్నాను. ఎందుకీ పాప నా హృదయంలో వచ్చి దాగి దాగుడుమూత లాడుతోందా? అని ఎడారిలో పువ్వు పూస్తుందా! అమావాశ్య నిశి శశికళ తొంగి చూస్తోంది? అనుకొన్నా. ఆ మనస్సు పూయకేం? పూస్తుంది ఎడారిని వనంగా కూడా మారుస్తుందని చెబుతోంది ఆత్మ......' అని ఆవిడ పాపకు నీళ్ళు పోయడం ముగించి లేచింది.

నేను తువాలు అందీయబోయాను. అప్పటికే ఆమె చీర చెంగుతో పాపను తుడుస్తోంది. పాప ఆ పొరల్లోకి చుట్టుకు పోవడానికి చూస్తోంది. ఆమె మెల్లిగా అంది ''కొన్ని అదృష్టాలు అంది కూడా జారిపోతాయి. అంతటితో జీవితంమాత్రం ఆగిపోదు. జీవితం అదృష్టాల పరంపర. ఒకటి పోతే యింకో అదృష్టం అందుకోవడానికి ప్రయత్నిస్తూంది.'' అన్నదామె.

''అంటే నీ వుద్దేశ్యం?.......'' అన్నాను.

''నా ఉద్దేశ్యం చెప్పానుగా.... యీ పాపని ఇలా ఆడిస్తూ చేతనైన సేవచేస్తూ జీవించాలని వుంది....

''మరి నీకి సేవలో పూర్తి ఆనందం కలుగుతుందా!.....

''గతానికి గీత గీయడం చేతనైతే ఏ ఆనందమైనా పూర్తిగా అనుభవించవచ్చు. ఏదైనా అదృష్టం తొంగి చూచినప్పుడు ఆరోజే జీవితం ప్రారంభమైందనుకోవడం మంచిది'' అని తీసుకొని వెళ్ళి పోయింది అక్కడి నుంచి.

''గతానికి గీత గీస్తే.... అదృష్టం తొంగి చూచినప్పుడు ఆరోజే జీవితం మొదలు అనుకుంటే '' అని ఆలోచిస్తూ స్నానం చేశాను....

ఇవతల వరండాలోకి వచ్చాను. ఇందిర పాపకు పౌడరు అదీ వేసి తల దువ్వుతోంది. ముఖాన తిలకం పెట్టింది. అప్పల్లు అక్కడే వుంది. పాప అప్పల్లు తీసి ఇందిర ముఖాన బొట్టు పెట్టింది. ఆమె ఉలిక్కి పడింది. తుడిచి వేసుకోవాలని ప్రయత్నించి నన్ను చూచి చెయ్యి దించివేసింది.

తిలకం దిద్దిన ముఖం చూడాలనిగాను నేను. ''నేను పెళ్ళాడితే ఆమె తిలకానికి భంగం వచ్చేది కాదు.'' అనిపించింది. ఇందిర ఆ బంగారుతో ఏమీ తోచక, నాపాదాలకు నమస్కరించింది. నేను స్థాణువునై పోయాను. పాప 'అమ్మ'అంది. వాళ్ళమ్మ వస్తోంది కాబోలని చూచాను. కాని ఆమె రాలేదు. ఇందిరే అప్రయత్నంగా 'హోయ్'' అని పాపను చంకను వేసుకొని వెనక్కి వెనక్కి చూస్తూ వెళ్ళిపోయింది. నేను వాగతించిన జీవితంలోకి తిరిగితిరిగి చూచుకుంటూ నిలబడి పోయాను.

ఈ సంఘటన జరిగి సంవత్సరమైంది. ఇందిర వద్ద నుంచి పాప కులసా అడుగుతూ వుత్తరాలు వస్తున్నాయి. 'ఒక్కసారి వచ్చి చూచిపొమ్మని చాలాసార్లు వ్రాశాను. కాని పిల్లను తీసుకు వచ్చే శ్రమున్న కోసమో ఏమో ఆమె రాలేదు. మేమే తీసుకుపోయి చూపాలనుకొన్నాం. కొద్దిరోజుల్లో ఇందిర యీలోకం విడిచి వెళ్ళిపోయిందని వుత్తరం వచ్చింది. ఆరోజున పాప నెత్తుకొన్న దృశ్యాలన్నీ కళ్ళబడ్డాయి. 'మరో అదృష్టం ఎదురైతే' అన్నది. ఆ అదృష్టం కూడా అందకుండా చేశాను యీ నేరం నాదేననుకున్నాను.

అప్పటినుంచి పాపమీద నాకు ప్రేమ ఎక్కువైంది. ఇందిర స్మృతులన్నీ పాపలో మెదిలేవి. కాని అస్మృతి రేఖల్ని కూడా చెరిపివేశాడు దైవం. అనుకోకుండా పాపకు టైఫాయిడ్ వచ్చి, మమ్మల్నికూడా విడిచిపోయింది. స్మృతిపథమంతా కారు చీకట్లు క్రమ్ముకున్నాయి. పాపని నేనెలా మరువగలను? పాపను స్మరించినపుడల్లా ఇందిర కూడా సాక్షాత్కారమయ్యేది. 'ఆమె చంకలో పాప'వున్న విడవని దృశ్యమైంది.

ఈ అనుబంధం ఇప్పటికీ ఎప్పటికీ నాకర్థం కాదు. అపరప్రేమకు, ఆనందానికీ, గల సంబంధమేదో ఇందిరా, పాపల జ్ఞాపకంలో కాపురం చేస్తూ వుంటుంది.

ఒక స్మృతికి ఇంకొక స్మృతి అనుబంధంగా నిలుస్తుంది, రెండు స్మృతులు కలసి నన్ను క్రుంగతీసి వేస్తూ వుంటాయి. ఇప్పటికీఎప్పటికీ నాజీవితమింతే.

ఈ అనుబంధానికి అర్థం తెలుసుకొని మరణిద్దామని వుంది మరి సాధ్యమో కాదో?

★

